# అచలపతి- అటెండెన్సూ

'ఓడలు బళ్లవుతాయి, బళ్లు ఓడలవుతాయి అంటారు' అనే సామెతతో ఈ కథ మొదలెడదామనుకున్నాను. కానీ నాకా సామెత నచ్చదు. పరిస్థితులు తారుమారై ఓడలు చిక్కినా మహా అయితే పడవలవుతాయి; బళ్లవవు. అలాగే బళ్ళు బలిస్తే కార్లవుతాయి, కానీ ఓడలవవు. కానీ బండికి చక్రాలు పీకేసినా ఓడ కాదు, ఓడ తెరచాప చింపేసినా బండికాదు.

అలాగని నేనేదైనా కొత్త సామెత 'కాయిన్' చేయబోతే పాఠకులకు అర్థం కాదు. పాఠకులకు కూడా నా స్థాయి ఉంటుందనుకోవడం 'దురాశ' కేటగిరీ కింది కొస్తుంది. పై వాక్యంలో 'కాయిన్' కు బదులు 'నాణెం' అని ఉన్నా నేను అర్థం చేసుకోగలనుకానీ వాళ్లర్థం చేసుకోలేరు.

అందువల్ల వాళ్ల కోసం సుబ్బరాజు ప్రస్తుత పరిస్థితి వర్ణించడానికి ఆ సామెతే వాడాల్సివస్తోంది. నిజానికి వాడిని లైబ్రేరియన్‌గా చూసినప్పుడు నాకూ ఆ సామెతే గుర్తొచ్చిందనుకోండి!

వాడిని లైబ్రేరియన్‌గా చూడవలసిరావడమే విచిత్ర పరిస్థితుల్లో జరిగింది. నేను చేపట్టిన ఓ కేసులో కథ అడ్డం తిరగబోయింది. నేను లాఘవంగా దాన్ని ఒడిసి పట్టుకుని నలభై అయిదు డిగ్రీలకు దాటకుండా ఐమూలగా తిప్పేసాను కానీ కొంతకాలం పాటు అండర్ గ్రౌండులోకి వెళ్ళాల్సి వచ్చింది.

'పాప్యులర్ రచనకు పదిమెట్లు'లో ఉదహరించిన మొదటి మెట్టు నేను ఎక్కానని పబ్లిషర్లు గుర్తించాలి. పాఠకుడిలో ఆసక్తిని రేకెత్తించడానికి రాబోయే కథకు విత్తనం ఈ కథలోనే వేసేసేనని గమనించాలి. వారూ, వారి హితైషులయిన పత్రికాధిపతులు క్రింది విధంగా ప్రకటనలు గుప్పించవచ్చు

– 'అనంత్‌గారి కథ అడ్డం ఎందుకు తిరిగింది? నిలువెందుకు తిరగలేదు? అండర్‌గ్రౌండ్ అంటే గ్రౌండ్‌కి అండర్ అనా? లేక గ్రౌండ్‌పైన కూడా అండర్

గ్రౌండ్లుంటాయా? అండర్ గ్రౌండ్ కెళ్ళాల్సిన అగత్యం అనంత్‌కెందుకు దాపురించింది?' వీటికి సమాధానాలు ఊహించి పాఠకులు రాయండి. రచయిత తలలో రూపుదిద్దుకుంటున్న ఊహతో సరిపోయే పాఠకుడి ఉత్తరానికి బహుమతి ఉంటుంది.

ఇంక చక్కటి ఊహను రచయిత ఇంకా కాగితం మీదకు ఎందుకు ఎక్కించలేక పోయారో సహేతుకంగా నిరూపించిన పాఠకునికి కన్సొలేషన్ బహుమతి రచయితే ఇస్తారు. అంటే రచయిత తన ఇంటి నుంచి పబ్లిషరు ఆఫీసు దాకా 'లిఫ్ట్' ఇస్తారు. మీ ఊహలు నేడే రాసి పంపండి.

విశేష ఆకర్షణ – ఈ పరిశోధనాత్మక నవలలో 'పురాణకాలంలో పాండవుల అండర్‌గ్రౌండ్' అనే అంశంపై మూడు వారాలకు సరిపడా వివరణ ఉంటుంది.

సూచన : మే 15 తర్వాత వచ్చిన పాఠకుల ఉత్తరాలు రచయిత తదుపరి నవలకు ఉపయోగపడతాయి.

హెచ్చరిక : పాఠకులు ఉత్తరాలు త్వరగా పంపకపోతే, సీరియల్ ప్రారంభించడం ఆలస్యమవుతుంది.

మందలింపు : ఈ సీరియల్‌లో ఉత్కంఠ ఉండదనీ, ఉత్తి కంఠశోషేనని ఘోష పెట్టే రైవల్ పాప్యులర్ రైటర్లను పట్టించుకొనకండి.

అండర్‌గ్రౌండ్ విషయంలో నరమానవుడికి తెలియకుండా దాక్కోడానికి భేషైన లైబ్రరీ చింతాద్రిపేటలో ఒకటుందనీ, అసలది ఉందని కూడా ఎవరికీ తెలియదనీ, అక్కడున్న లైబ్రేరియన్ ఖాళీగా కూచుని ఈగల్నీ , దోమల్నీ తోలేయడం వలన నిద్రకు ఢోకా ఉండదనీ ఒకాయన సలహా యిచ్చాడు.

ఆ లైబ్రేరియన్ను చూడగానే అడిగా – 'మీరు సుబ్బరాజు ద్విపాత్రాభినయమా?' అని.

"నేను అభినయాన్ని కాదు, మనిషిని, సుబ్బరాజు నాకు తెలీదు." అన్నాడతను బింకంగా.

"అలాగా, సినిమా ఇంకా స్టార్టవలేదన్నమాట. రాబోయే కథ చెప్పేస్తా వినండి. మీ పోలికల్లోనే సుబ్బరాజు అని ఒకడున్నాడు. మీరు పేదవారు కాబట్టి వాడికి డబ్బుంటుందని సులభంగా ఊహించవచ్చు. అసలీపాటికి మీరు ఒకరికొరు తారసిల్లి

స్థానాలు మార్చుకోవాలి, ఒకరి సమస్య లింకొకరు పరిష్కరించుకోవాలి. ఇప్పటిదాకా మీరు కలవలేదు కాబట్టి వాడి కథా కమామీషూ వాడి డ్రైవరో, బట్లరో చెప్పేబదులు నేనే చెప్పేస్తాను, వినండి– 'అనగనగా ఒక సుబ్బరాజు, నా క్లాస్‌మేట్, చాలా మంచివాడు. అమాయకుడు. ఫ్రెండ్సంటే ప్రాణం'.

ఇది చెప్తుండగానే లైబ్రేరియన్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నా కనుమానం వచ్చింది. "పేదవాడి గుడ్డితల్లి పోర్షన్ కూడా మీరే వేసేస్తున్నారా? ఎందుకా ఏడుపు?" అని అడిగి చూశా.

"ఒరేయ్, అనంతూ, నేనే సుబ్బరాజునిరా" అంటూ భోరుమన్నాడు లైబ్రేరియన్
.

"ఓహో, అంటే సినిమా ఇంటర్వెల్ దాకా వచ్చేసిందన్నమాట.."

"ఒరేయ్, నాది డబుల్ రోల్ కాదురా, సింగిలేరా. ఆస్తి పోయి నేనే లైబ్రేరియిన్నయి పోయానురా. ఈ స్థితిలో నీ కంటబడడం ఇష్టం లేక నిన్ను గుర్తుపట్టనట్టు నటించబోయా.. కానీ నా గురించి మంచిమాటలు చెవిన పడగానే కళ్లంబడ నీళ్లొచ్చేసాయిరా".. అంటూ భోరుమన్నాడు.

సుబ్బరాజు తండ్రీ, తాతా ఓ వెలుగు వెలగడానికి చాలా తైలమే ఖర్చయిందట. అదీ అప్పుతో కొన్న తైలం. చివరికి మనవాడికి ప్రమిదే మిగిలిందట. అదే చిప్పగా భావించి అడుక్కోబోతే పెద్దలు వద్దన్నారట. చివాట్లకు వంశగౌరవం డైలాగులు తొడిగేరట. అందుకే మారుపేరుతో – ఈ లైబ్రేరియన్ అవతారంలో!

లైబ్రరీకి ఓ కథ ఉందట. భవంతి తాతగారిదేట. పన్ను బకాయిల కింద ప్రభుత్వం జప్తు చేసిందట. గవర్నమెంట్ ఆఫీసు పెట్టబోతే బిల్డింగు మరీ పాతగా ఉందని స్టాఫ్ ఒప్పుకోలేదట. సామాన్లు జాబితా తీసే కార్యక్రమంలో విరిగిపోయిన బొమ్మలన్నిటినీ ఓ హాల్లో పెట్టి 'ఆర్కియాలజీ మ్యూజియం' అన్నారట. కొన్ని గదుల్లో గవర్నమెంట్ రికార్డులు పట్టుకొచ్చి పడేసారట. అలా పడేస్తూంటే కొన్ని పుస్తకాలు అడ్డు వచ్చాయట.

మతం, వేదాంతం, మనస్తత్వశాస్త్రం వంటి భారీ విషయాలపై రాసిన భారీన్నర పుస్తకాలను సుబ్బరాజు తాతగారు సేకరించి, బైండు చేయించి భారీ ముప్పావు చేసారట. అవన్నీ ప్రభుత్వంవారు ఓ గదిలో సర్ది దాన్ని లైబ్రరీ అన్నారట. ఆ వంశంలోని మొలక కదాన్న జాలికొద్దీ సుబ్బరాజుకి టెంపరరీగా లైబ్రేరియన్ పదవి

కట్టబెట్టారు. పాఠక జనాలు బాగా వచ్చి అభివృద్ధి చెందితే ఉద్యోగం పర్మినెంట్ చేస్తామన్నారట.

ఓ రూళ్ల కాగితాల పుస్తకం పెట్టి వచ్చినవాళ్ల సంతకం, అడ్రసు తీసుకోమన్నారట. రోజుకి కనీసం పదిమందైనా రాకపోతే ఉద్యోగానికి ముప్పు అన్నారట.

నే వచ్చిన మూడో రోజు మధ్యాహ్నం – "ఒరేయ్ , నా ఉద్యోగం ఊడేట్లా ఉందిరా. ఇలాంటి లైబ్రరీల మీద నిఘా పెట్టారుట. కొంతమంది లైబ్రరీ తెరవకుండానే ఇంట్లో కూచుని నాలాగే కుడిచేత్తో ఎడం చేత్తో సంతకాలు పెట్టి కాగితాలు నింపేసి జీతాలు కొట్టేస్తున్నారట. అందుకని ఆ టీమువాళ్లు రహస్యంగా వచ్చి మనుషులున్నారా? లేదా? సంతకాలు ఒకళ్లే చేసినట్టున్నాయా? వాళ్లిచ్చిన అడ్రసులు నిజమైనవేనా? ఇలాంటివి కనిపెడతారట. ఇక మన పని గోవిందా, నూటికి తొంభై సంతకాలు నావేనని కనిపెట్టటం ఖాయం.' అంటూ వాపోయాడు సుబ్బరాజు.

ఆవేళప్పుడు నేను విశ్రాంతి చిత్తగిస్తున్నాను. కళ్లు మూతలు పడుతూన్నాయి. "పోనీ గుర్తు తెలీకుండా కొన్ని వేలిముద్రలు వేయకూడదూ" అనే సమయోచిత సలహా పడేశా.

వాడికి మండింది. "వేలిముద్రలవాళ్లు లైబ్రరీ కెందుకు వస్తార్రా? నా గోడు పట్టించుకుని మంచి సలహా చెప్పరా అంటే...? టీవీలొచ్చాక పుస్తకాలు చదివేవాడెవడ్రా, అందులోనూ ఇలాటి పుస్తకాలు..".

"ఒరేయ్ పుస్తకాలంటే గుర్తొచ్చింది. స్వామీ తల్పానంద ఎవర్రా? కనబడి ఓ షేకేండ్ ఇవ్వాలని ఉంది".

వాడు తెల్లబోయాడు. "ఎవరాయన?"

"ఇదిగో నా తల కింద ఉన్న పుస్తకం ఉంది చూశావూ, అది రాసినాయన, మంచి లెక్కల్లో మనిషిలే. పేజీలు లెక్కగా రాస్తాడు, సరిగ్గా నా తల ఎత్తుకి సరిపోతుంది. ఓ వంద పేజీలు అటూ, ఇటూ రాసినా నాకు ఎత్తు సరిపోక మెడ నెప్పెట్టి ఉండేది".

"ఇది నా జీవనస్మరణ సమస్యరా బాబూ, నీ దిండు సమస్యకాదు," అని అరిచాడు వాడు.

"వెయింగు మెషిన్లో కాయినేసి టిక్కెట్టు వచ్చేలోపుల హడావుడి పడి మిషన్ని గుద్దేస్తే

ఎలారా? టిక్కెట్టు లోపలికి వెళ్లాలా? మెషిన్ ఏమనుకుంటోందో దానిమీద అచ్చు గుద్దాలా...?"

"అయితే అయిదు నిమిషాలు పోయాక చెప్తావా?"

"ఇప్పుడిక లాభంలేదు. చక్రం తిరుగుతూంటేనే కాయిన్ వేశావు. అంటే నా కళ్లు మూతలు పడుతూండగా విషయం చెప్పావు. నిద్ర లేచాక నీ సంగతి చూస్తా".

"ఓరేయొరేయ్, పడుక్కొనేటప్పుడు ఓ పుస్తకం తెరిచి మొహాన్న పెట్టుకుని పడుక్కోరా. చెకింగ్ వాళ్లు వచ్చినప్పుడు ఓ రీడర్‌గా లెక్కలోకి వస్తావు".

"సరే అలాగేకానీ, పాత ఆంధ్రపత్రిక వీక్లీ బైడింగు తీసుకొచ్చి నా మొహం మీద పెట్టు. కునేగా మరికొళుందు పీలుస్తూ పడుక్కొంటా. ఆ విప్లవ కవితా సంపుటి దూరంగా నెట్టు. నాకు రక్తం వాసన పడదు" అని నడుం వాల్చా.

'మీకు తెలుసా?', 'నమ్మలేని నిజాలు' వంటి కాలమ్స్‌కి మీరు విషయాలు సేకరిస్తూ ఉంటే మీకు పనికొచ్చే సమాచారం ఇస్తున్నాను కాసుకోండి –

'సమస్యలకు పరిష్కారాలు గొప్పవారి కలల్లో లభిస్తాయా?' అన్న ప్రకరణం తీయండి 'కుట్టుమిషన్ సూది వైనం' ఐటమ్‌కి దిగువుగా ఇలా రాసుకోండి.

'సుబ్బరాజు సమస్యకు పరిష్కారం అనంతశయనంకు కలలో తట్టిన భోగట్టా'

– 'ఆరోజు మధ్యాహ్నం అనంతశయనం తలకింద స్వామీ తల్పానంద పుస్తకాన్ని పెట్టుకుని లైబ్రరీ బెంచి మీద పడుక్కొని నిద్రపోతున్నారు. వారి శరీరం నిద్రించింది కానీ మనస్సు మేల్కొనే వుంది. విశ్రాంతి ఎరుగని క్రాంతివీరుడాయన. మదిలో సుబ్బరాజు సమస్య నా మాటేమిటంటూ ఆయనను దొలిచివేస్తోంది. అంతలో ఆయన కొక కల.

ఓ లైబ్రరీ హాలు, పాతకాలపు ఎర్రటి ఇటికల కట్టడం, పెద్ద స్తంభాలు, హాలులో మధ్యగా పెద్ద పెద్ద స్తంభాలు, ఒకరికొకరు కనబడనట్టు స్తంభాలాట ఆడుకునేటంత హాలు, అద్దాల బీరువాలు, లోపల లావు పుస్తకాలు, చల్లదనం, నిశ్శబ్దం. పొడుగాటి పేద్ధ డైనింగ్‌టేబుల్. దాని చివర జోగుతున్న లైబ్రేరియన్. ఇద్దరేసి పట్టే పెద్ద పేము కుర్చీలు.

అది సుబ్బరాజు లైబ్రరీ హాలే! అంతలోనే ఖాళీ లైబ్రరీ హాలు మనుష్యులతో నిండిపోయింది. వాళ్లు అటూఇటూ చకచకా తిరగటం లేదు. ఒక్కో కుర్చీలో ఇద్దరేసి కూర్చున్నారు. ఓ కుర్చీ కుర్రాడూ, కుర్రదీ కళ్లు కలుపుకుంటున్నారు. పక్కకుర్చీ

జంట కాళ్లు కలుపుతున్నారు. కొన్ని కుర్చీల్లో వాళ్లు లావుపాటి పుస్తకాల చాటున పెదాలు కదుపుతున్నారు. మరి కొంతమంది చేతులుమాత్రం కలుపుతున్నారు. బల్లమీదున్న పుస్తకాల దొంతర వల్ల ఒకరికొకరు కనబడటంలేదు. ఏ అంతరాయం లేకుండా ఎవరి కార్యకలాపాల్లో వాళ్ళున్నారు. లైబ్రేరియన్ ఎటో గాలిలోకి చూస్తున్నాడు. అతనికి వీళ్లెవరూ కనబడటంలేదు. అతనికి కనబడుతున్నది అటెండెన్స్ పుస్తకం ఒక్కటే! దాన్నిండా పేజీలకు పేజీలు సంతకాలు.

నా కథలు చదవడమే ఓ ఎడ్యుకేషన్ కాబట్టి, ఈ పాటికే నా పాఠకులు సుబ్బరాజుకి నేనెలాటి సలహా యిస్తానో ఊహించి ఉంటారు –

"ఒరేయ్ ఈ లైబ్రరీని ప్రేమికుల రహస్యస్థావరంగా మార్చేయి. నీకు కళ్లు మసక అని ప్రచారం జరిగిందనుకో. జంటలన్నీ ధైర్యంగా ఇక్కడికే వాలి, గూడు కట్టుకుంటాయి. వాళ్లలో వాళ్లకి ఒప్పందాలు ఉంటాయి–ఒకరి కార్యకలాపాలు మరొకరు పట్టించుకోకూడదని. నువ్వు వాళ్లని పట్టుకుని అభ్యంతరం పెడతావన్న భయం ఉంటుంది కదా. అసలు నీకు చూపు ఆనదని అనుకున్నారనుకో, బ్యాచ్‌ల్లో వచ్చేసి లైబ్రరీ అంతా ఆక్రమించేస్తారు. ఈ మహానగరంలో ఏకాంత ప్రదేశం దొరకడం కష్టం. బీచ్‌లో కూడా కాపలావాళ్లుంటారు. అందువల్ల ఇలాటి స్థలం కోసం వెదుకుతుంటారు వాళ్లు. వాళ్లలో వాళ్లు కబురందించుకుని రోజురోజుకీ మరింత మంది వస్తారు, చూస్కో. వచ్చినవాళ్లందరూ సంతకాలు పెట్టాలని మాత్రం మధ్యలో అరుస్తూండు చాలు".

సుబ్బరాజు కీ సలహా నచ్చింది కానీ సందేహం వచ్చింది. తనకు కళ్లు మసక అని వాళ్లకెలా తెలియజేయాలి? అని.

"అదా, రోజూ వాటెండ్ కాలమ్ చూడడానికి వచ్చే మురుగన్ ఉన్నాడుగా. వాడితో 'ఏమండీ, ఆ పంజాబీడ్రస్సు అమ్మాయీ ఆమెతో వచ్చిన కుర్రాడూ ఆ మూల ఏం చేస్తున్నారండీ? నాకు కళ్లు సరిగ్గా కనబడవు కదా, అందుకని అడుగుతున్నాను. ముద్దు పెట్టుకున్నా ఫర్వాలేదుకానీ మేగజైన్లు పట్టుకుపోతూంటే మాత్రం చెప్పండేం' అను, చాలు. నా అండర్‌గ్రౌండ్ పీరియడ్ రేపటితో పూర్తవుతోంది. ఈ ప్లాను సక్సెస్ అయిందో లేదో వారం రోజుల తర్వాత ఫోన్ చెయ్యి".

సుబ్బరాజు ముఖంలో జ్ఞానజ్యోతి ప్లస్ ఆనందజ్యోతి వెలిగాయి. వాటికి కరెంటు సప్లయి చేసింది భవదీయుడని తమరు గుర్తుంచుకోవాలి.



ఓ మహారాజుగారు సాయంకాలం తోటలో తిరుగుతున్నారనుకోండి. మంత్రిగారొచ్చి ఫలానా కవిగారు తమ ప్రదర్శనం కోరుతున్నారు. మీమీద ఏదో పద్యం చెప్తారట. అంటే 'సరే రమ్మను వినేద్దాం. ఓ పనయిపోతుంది' అని రాజుగారు అంటారా? అనరు. 'రేపు నిండు పేరోలగంలో చదవమను' అంటారు. ఎందుకు? 'నీ కీర్తి

ఆకాశం అంచుదాకా పాకింది, నీ రాజ్యం భూమి చివరిదాకా సాగింది' స్టయిల్లో కవి పద్యం చదువుతాడని తెలుసు కాబట్టి. (అదే పద్యం మూడు మైళ్లవతల ఇంకో సంస్థానంలో కూడా చదువుతాడని కూడా తెలిసినా పట్టించుకోరు) అది విని హర్షధ్వానాలు చేయడానికి మనుషులు కావాలి. అందుకని రాజుగారు మర్నాడు సభ తీరుస్తారు. ఊళ్లో జనమంతా సభకొచ్చి రాజుగారి ముచ్చట తీరుస్తారు.

అందుకనే వారం తర్వాత సుబ్బరాజు నాతో ఫోన్లో మాట్లాడదామని ప్రయత్నిస్తున్నాడని అచలపతి చెప్పినప్పుడు, 'సాయంత్రం నిలయంలో కనబడమను' అని చెప్పా!

రాజుగారి సభ సీన్లు సినిమాల్లో చూసినప్పుడు మీకూ నా లాగానే అనుమానం వచ్చి ఉండవచ్చు, అందులో తలపాగాలు చుట్టుకుని చప్పట్లు కొట్టే జనాభా అంతా ఏ రకమాని. వాళ్ళందరికీ వ్యవసాయమో, వ్యాపారమో ఏదో ఒక వ్యాపకం ఉండి ఉంటే అక్కడెందుకు కూచుని ఉంటారు? అవేమీ లేనివాళ్లే అక్కడ పోగడతారన్నమాట.

మా ఊళ్లో అలాటివాళ్లు పోగడే చోటు – 'నిక్షేపరాయుళ్ళ నిలయం'! శ్రమపడవలసిన అవసరంలేని నా బాపతు పెద్దమనుషులకోసం నడుపుతున్నది క్లబ్బది. అక్కడే వారాల తరబడి పడి ఉండటానికి కావలసిన ఏర్పాట్లన్నీ ఉన్నాయి. మన గురించి ఇతరులు చేసే ప్రశంస మన జాతి పక్షులందరూ వినాలనుకోవడం, విని అభినందిస్తుంటే మురవా లనుకోవడం తప్పు కాదు కదా. అందుకే అక్కడకు రమ్మనమన్నా. తర్వాత నేను గ్రహించినదేమిటంటే – మా నిలయం జనాభా తక్కిన విషయాల్లో అమోఘంగా ఉన్నా ఇంగితం విషయంలో మాత్రం కాస్త వెనకబడి వున్నారు.

ఎప్పుడూ గుమిగూడాలో, ఎప్పుడు గూడకూడదో సరైన అవగాహన లేదు వాళ్లకి. అందుకనే సుబ్బరాజు వచ్చి, 'నీ ప్లాను బ్రహ్మాండంగా పనిచేసిందిరా. రోజుకి నలభై జతల సంతకాలనుకో' అని అన్నప్పుడు ఇద్దరు ముగ్గురికంటే ఎక్కువమంది దగ్గరకు రాలేదు. వినలేదు.

కానీ పది రోజుల తర్వాత వాడొచ్చి 'నీ ఐడియా చీదేసిందిరా. లైబ్రరీ మునిగిపోయింది' అన్నప్పుడు మాత్రం పదిహేను, ఇరవైమంది చెవులు రిక్కించుకుని విని చుట్టూ మూగేశారు.

సుబ్బరాజు దగ్గర కొచ్చే జంటలు చాటుమాటుగా వచ్చేవాళ్లు కదా. వీడి పోరుపడలేక సంతకాలు పెట్టినా అన్నీ దొంగ సంతకాలూ, దొంగ అడ్రసులూనట. కొంతమంది పై

అడ్రసు కింద డిటో, డిటో పెట్టేస్తున్నారట. రోజుకో కొత్తపేరు రాయడం బద్ధకించి పైన ఎ.కుమార్ ఉంటే కింద బి. కుమార్, సి.కుమార్.. అంటూ రాసుకుపోయార్ట. పుస్తకం నిండుతోందన్న సంతోషంలో వీడు చూసుకోలేదు కానీ చెకింగ్ కి వచ్చిన వాళ్లు చూశారట. కావాలని మోసం చేస్తున్నాడన్చెప్పి లైబ్రరీనీ, దాంతో బాటు వీడి ఉద్యోగాన్ని మూసేయమని రికమెండు చేశారట.

మా 'నిలయ' విద్వాంసులకు ఎలా మాట్లాడాలో కూడా తెలియదు. అందులో ఒకడు, "పోయి పోయి అనంతాన్ని సలహా అడగడం ఏమిటండి బాబూ, అతని దగ్గర అచలపతిలాటివాడు ఉండగా" అనేశాడు.

"పోయి పోయి కాదండీ వాడే నా దగ్గరకు వచ్చి వచ్చి సలహా యిచ్చేడు" అని వాడికి సమాధానం ఇచ్చి "ఒరేయ్, అచలపతి ఎవర్రా, కాస్త చూపెట్టు" అన్నాడు నాతో సుబ్బరాజు.

మా నిలయంగాడిని నిలువునా చీరేసి, పేగులు లాగేసి, తిరగేసి, మరగేసి వాడి ఒంటి లోపలిభాగంతోనే వాడిని చుట్టేసి పేగులేసి గట్టిగా కట్టేసి ఇంటికి పార్శిల్ చేసేద్దామనుకున్నాను. ముందు సుబ్బరాజుని అక్కణ్ణుంచి తరిమేయాలి. 'అచలపతి అని ఎవరూ లేరులే! ఈ కథలో పాత్రలు సజీవ బై నిర్జీవ వ్యక్తులకు సంబంధించినవి కావు' అని గుర్తుంచుకో, లైబ్రరీ ఉద్యోగం పోతే పోయిందిలే. బీచ్‌లో సుండల్ అమ్ముకో. ఈ ప్రేమపక్షులను అక్కడ కలిసి గుర్తు పట్టేస్తానని బెదిరించి అమ్మకాలు పెంచుకో" అని తోలేశా.

పిల్లల ప్రోగ్రెసు రిపోర్టులు చూసినప్పుడు తల్లిదండ్రులు 'నువ్వు పెద్దయ్యాక అడుక్కు తినడం ఖాయం' అంటారు. అలా వారి భవిష్యత్తును అంజనం వేసి చూపించడంతో వారి బాధ్యత తీరిపోయిందనుకుంటారు కానీ అడుక్కొనేందుకు చిప్పా, కూచునేందుకు ఓ గుడీ ఏర్పాటు చేయడం గురించి ఆలోచించరు.

నేనలాగ కాదు కాబట్టి సుబ్బరాజు సుండల్ అమ్మకం గురించి విశేషంగా కృషి చేశాను. బాంక్ లోన్లు ఎరేంజ్ చేయడానికి చార్టర్డ్ ఎకౌంటెంట్లు అన్ని రకాల బిజినెస్సుల మీదా నివేదికలు తయారుచేస్తుంటారు కాబట్టి ఓ చా.ఎ.ను ఈ పనిమీద నియమించా. ఆయన పది రోజుల తర్వాత రిపోర్టు చేతి కిచ్చాడు. అందులో సుండల్ పుట్టుపూర్వోత్తరాలేకాక, మెరీనా బీచ్‌లో ఏయే జాగాల్లో ఎంతెంత అమ్మకాలు జరుగుతాయో ఎలాంటివాళ్లను ఎంత మోతాదులో సతాయించి అమ్మాలో అన్నీ

విశదంగా ఉన్నాయి.

అచలపతిని పిలిచా. "ఈ రిపోర్టు ఫలానా సుబ్బరాజుకి ఇచ్చిరా. బైదిబై నీ పేరు అచలపతి అని చెప్పక. అచ్చుయ్యో, బుచ్చుయ్యో అను".

అచలపతి మెత్తగా దగ్గాడు. "మరీ వివరాలు అడుగుతున్నానని అనుకోకపోతే ఈ ఫలానా సుబ్బరాజు ఎక్కడ ఉంటారో చెప్తారా సర్?" అని అడిగాడు.

అడ్రసు చెప్పబోయి తడుముకుంటుంటే "లైబ్రరీలో ఉండే సుబ్బరాజుకీ, ఈయనకీ... ఏదైనా చుట్టరికం..?" అని అర్థోక్తిలో ఆగేడు.

పెనుభూతం నా అనుమానం వేషం వేసుకుంది. 'కొంపదీసి..వాడు... నిన్ను..సలహా.. అదే.. లైబ్రరీ అటెండెన్సు గురించి..' అంటూ పావోక్తిలో ఆగేను.

అచలపతి ముఖంలో ఏ భావం కనపరచకుండానే చెప్పుకొచ్చాడు. "నేను దానిని సలహాగా పేర్కొనజాలను సర్. సుబ్బరాజుగారు నన్ను కలిసి చెకింగు విషయం చెప్పారు. ఆయన స్థానంలో లైబ్రరీలో నేను నాలుగు రోజులు వెళ్లి కూర్చున్నాను. ఆయన లేరని చెప్పాను. నాది డేగచూపనీ, స్తంభం గుండా గూడా చూడగలిగే శక్తి ఉందనీ చెప్పాను. దూరదూరంగా గజానికొకరు కూర్చోవాలన్నాను. అందరూ అదిరిపడ్డారు. సుబ్బరాజు స్థానంలో వేరెవరు వచ్చినా, లేక లైబ్రరీ తీసేసినా తమ స్థావరం పోతుందని భయపడ్డారు.

"మురుగన్ ద్వారా లైబ్రరీ మంత్రిగారికి కబురు పంపారు. ప్రజాక్షేమం దృష్ట్యా లైబ్రరీని మూసేయడానికి వీల్లేదని, అక్షరాస్యత ఉద్యమ పతాకం కింద ఆందోళన చేస్తామని, సుబ్బరాజునే లైబ్రేరియన్‌గా ఉంచమంటామనీ అన్నారు. అడ్రసుల విషయంలో కూడా స్వంత అడ్రసు కాకపోయినా, టెలిఫోన్ డైరెక్టరీ చూసి ఎవరిదో ఒకరిది నిజమైన అడ్రసు రాస్తామని సుబ్బరాజుకు హామీ ఇచ్చారు. సుబ్బరాజుగారు సరేనన్నారు. యువజన సంఘం వాళ్ల ఆందోళన అనగానే ప్రభుత్వంవారు భయపడి లైబ్రరీ జోలికీ, సుబ్బరాజు జోలికి పోలేదు. ఇదీ సంగతి. నేను చేసినదానిని సలహా కంటె సహాయంగా మీరు ఉదహరించ వచ్చని సూచిస్తున్నాను సర్".

నాకు మండిపోయింది. "మరి ఇన్నీ తెలిసి నేను సుండల్ వ్యాపారం సమాచారం గురించి అవస్థపడుతూంటే చూస్తూ ఊరుకున్నావేం?చెప్పవచ్చుగా" అని నిలదీశా.

"మీరీసారి ఎప్పుడైనా అండర్ గ్రౌండ్‌కి వెళ్ళవలసినప్పుడు సుండల్ వ్యాపారి వేషం వేసే ఉద్దేశ్యంతో వివరాలు సేకరిస్తున్నా రనుకున్నాను సర్. ఎందుకంటే లైబ్రరీలో ఈ

మధ్య బొత్తిగా చోటు ఉండటం లేదట. సుబ్బరాజుగారు ఇందాకనే ఫోన్ చేసి చెప్పారు' అన్నాడు అచలపతి తొణక్కుండా.

పళ్లు పటపటలాడించడం తప్ప నేను వేరే శబ్దమేమీ చేయలేదు.



తక్కిన 9 కథలూ "అచలపతి కథలు 02" లో...